# ధ్వని - ప్రతిధ్వని

## కాయితి అప్పారావు

అదే పనిగా ఆలోచిస్తున్న అనసూయను దూరం నుంచే జాలిగా చూస్తూ అనుపమ నెమ్మదిగా వెళ్లితాకింది. వెనుతిరిగిన అనసూయ 'వాళ్ల త్రోవలో వుంటారు పిన్నీ! వచ్చిన వాళ్లకు నేను నచ్చకపోను...అయినా వాళ్లుకోరే కోర్కెలు ... నాన్న తట్టుకోగలరంటావా.'' గోముగా అనుపమ చేతిని నిమిరింది.

''నీ అందచందాలు చూసేక సూర్యం దాసోహమనక మానడు. అందమైన భార్య సమకూడగానే తలితండ్రులు తృణప్రాయంగా కనిపిస్తారు. వాళ్ళ చెప్పే ఏ హితోక్తులైనా అంతగా పట్టించుకోడు అనసూ! గురజాడవారి విజయనగర వాసులు. ఉద్యోగరీత్యా విశాఖలో కాపురం. ఆయన కన్యాశుల్కం చదివినవారు కట్నాల జోలికి పోరనుకుంటాను.''

''నీ నోటి ఆశీర్వచన ఫలం—గుండెల మీది కుంపటిలా కలకాలం కన్నవారింట పడుండేకన్న ఏ ఒకరినో భర్తగా పొందటం మంచిది పిన్నీ! ఏదీ... ఆ చేతిలోని దువ్వెన ఇలాతే! తల దువ్వుతా'' అంటూ అనుపమ కురులను దువ్వింది.

''అక్కడక్కడ తెల్ల వెంట్రుకలున్నాయి. అవి ఊడిపోకుండ మాత్రం చూడు అనసూయా! కట్న పిశాచానికి బలై పోయిన మీ పిన్ని ఏ ఒక్కరికీ అర్ధాంగి కాలేక పోయిందన్న తీపి గుర్తుల్లా తెల్ల వెంట్రుకలు ... అందుకనే అవంటే నాకు అభిమానం''

అనసూయ దిగులుగా వింటూనే మిగిలిన కురులు సవరించింది.

''నా తరువాతది నా చెల్లెలు తెగించి ఉద్యోగంలో చేరి-యీ జమ్‌షెడ్‌పూర్‌లో పెళ్లి చేసుకుని నన్నిక్కడే పెట్టుకుని ఆదరించబట్టి గాని లేకపోతే తలితండ్రులు లేని నాగతేమై వుంటుంది అనసూయా! నన్ను చూడటానికొచ్చిన వాళ్లందరి మాటలూ ఒకే మూసలో పోసినట్టుండేవి. నాకైతే పెళ్లికూతురు నచ్చింది. మా అమ్మా నాన్నలు కట్న కానుకలంటున్నారు. వాళ్లమాటకాదని చేసుకుంటే అనుపమ అత్తవారింట దెప్పడు మాటలతో ఏం సుఖపడుతుందని అనే వారే అందరూను''

''మీ బంధువులేగా సూర్యం! మంచివారేనా పిన్నీ?''

''ఎప్పుడో చిన్నప్పుడు చూసాను. ఇక్కడ నువ్వున్నావని మీ నాన్నగారు రాయమంటే రాశాను. ఇంతదూరం వస్తున్నారంటే నీ అందచందాలు వున్నదున్నట్టు రాశాను అనసూ'' అంటుండగా విశ్వనాథం పువ్వుల పొట్లం తీసుకు వచ్చి ''మామయ్య నిన్ను తయారై వుండమన్నారు'' అంటూ అనసూయ వైపు అమాయకంగా చూస్తున్నాడు.

''చూశావా పిన్నీ! మామయ్య స్కూల్ ఫైనల్ తప్పడంచేత కంపెనీ డ్రైవరుగా చేరవలసివచ్చింది. నే ఇంటర్ టైపు పాసయాను. అయినా నాన్న నే ఉద్యోగం చేయటానికంగీరించటంలేదు. తెలుగువారికి తెలుగు సంస్కృతికి దగ్గరసా చేరుస్తానంటూ మామయ్యను కాదంటున్నారు. తల్లిలేని పిల్లను. ఆయన మనసు నొప్పించటం నాకేమాత్రమిష్టంలేదు పిన్నీ ... మరో తొమ్మిది మాసాల్లో రిటైరై పోతున్నారు'' అంటుండగా విశ్వనాథం అనసూయ వైపు జాలిగా చూస్తూ కంపెనీవైపు నడచి పోయాడు.

సాయంత్రం నాలుగు గంటల సమయం. పెళ్లి చూపులవారు అనుపమ ఇంట్లో అడుగు పెట్టారు. విశ్వనాథం బావకన్న ఎంతో అందంగా వున్న సూర్యాన్ని కిటికీలోంచి చూసిన అనసూయ ఆనందానికంతులేదు.

''అందం — ఆదర్శం... ఒకదానితో నొకటి సఖ్యతగా వుండవు అనసూ!'' అని ఎవరో ఘోషిస్తున్నట్టనిపించింది.

''ఆయనే సూర్యం అనసూ! ఆయన మీ కాబోయే మామగారు. మీ విజయనగరాన్ని గురజాడ సంస్కృతిని, మనతెలుగుదేశాన్ని మరచి పోలేదు మామగారూ అన్నట్టుగా గురజాడ కన్యాశుల్కాన్ని చేతిలో పట్టుకుని మరీ పైకి పెళ్లి వాళ్లిద్దరకూ నమస్కరించు. యీ మహా కావ్యాన్ని చూసినవారు కట్నాల విషయం అంతగా పట్టించుకోరు'' అని అనుపమ అనసూయను పైకి పంపింది. వాళ్లిద్దరకూ వినయపూర్వకంగా నమస్కరించింది. రెప్పార్పకుండా సూర్యం అనసూయ అందచందాల్ని చూస్తున్నాడు.

''అమ్మాయి విషయం అనుపమ రాసింది. అందుకే ఇంతదూరం శ్రమనుకోకుండా వచ్చాం. కథలు కావ్యాలు కాలక్షేపానికేనమ్మా! వాటిని చదివి మారిపోతే ప్రతీ సంసారీ సన్యాసుల్లో కలిసిపోవలసిందేనమ్మా! ఆ నాటకాలు ప్రచారం చేసే రమణమూర్తి వాళ్లను అడిగి చూడండి కట్నం లేకుండ చేసుకున్నావా బాబూ అని ... సూటిగా సమాధానముండదు. చిరునవ్వుతో తప్పించుకుంటారు. కన్యాశుల్కం చేతబట్టి నమస్కరించినంత మాత్రాన కట్న కానుకలు తగ్గవమ్మా! అందరిలో తిరిగే నాకూ అబ్బాయికీ అవమానం ... అనుపమతో అన్నీ చెప్తాంగా! నిశ్చితార్థం పుచ్చుకోకుండ కాఫీ ఫలహారాలు తప్ప మీ ఇంట్లో భోజనం చెయ్యకూడదు. అవన్నీ అనుపమ ఇంట్లో కానిస్తాం.''

''మరో తొమ్మిది నెలల్లో రిటైరై పోతున్నాను. దగ్గరసా ముప్పైవేలరూపాయలు రావచ్చును. మీ కోర్కెలు తీర్చాలన్నా పెళ్లి కావాలన్నా అంతవరకూ ఆగాలి బావగారూ!'' అన్నాడు అనసూయ తండ్రి.

''అనసూయ మాకు నచ్చింది. యీ సంబంధాన్ని ఎలాగూ విడిచేదిలేదు. ఈ సంబంధం తప్పటమంటే అది మా లోటుపాట్లవల్లేగాని మీ తప్పుగా మాత్రం భావించకండి'' అంటూ లేచి అనుపమ ఇంటికి వెళ్లారు.

''ఏరా సూర్యం! సిగ్గుపడకుండ చెప్పు ... అనసూయ ... నచ్చిందికదూ!''

''చాలందంగా వుందండత్తమ్మా! మా నాన్న... చౌకబారు పెళ్లి కాకుండ కట్నకానుకలుండాలంటున్నారు. దాంతోనే చెల్లాయిల పెళ్లి కావాలంటున్నారు.''

''సాహసించి ఎదురించి ముందడుగు వెయ్యలేవా సూర్యం?''

''నాలాంటి యువకులందరకూ పిరికితనం, బానిస తత్వం నరనరాల్లో జీర్ణించుకుపోయింది అత్తమ్మా!''

''ఉన్నదున్నట్టు చెప్పావు సూర్యం! నా తలలో యీ తెల్లవెంట్రుకలు మీ యువకుల భావాలకు తీపి గుర్తులుగా మిగిలిపోయి జీవితాంతం కన్య జీవితం గడపవలసి వచ్చింది. అయినా ఎదుటివారి బాధలు నీకెందుకులే! చిన్నత్తమ్మ వంట చేసింది. భోజనంచేసి టౌనంతా చూసిరండి. మా మరదిని తోడుగా పంపిస్తాను.''

''అనసూ! మంచి సంబంధమే... కాని మోయలేని కట్నకానుకలు. ఆ ఇంట పెళ్లి కావలసిన ఐదుగురాడ పిల్లలున్నారు. వాళ్ళ రేపుదయమే తిరుగు ప్రయాణం. నీకు వాళ్లిచ్చిన జాబితా చూపిస్తాను. దాని దగ్గర గురజాడ ఓడిపోక తప్పదు... చదవమంటావా అనసూ?''

''చల్లకు వచ్చి ముంత దాయడమెందుకు పిన్నీ? చదివి వినిపించు. వాటి ఖరీదుతో సూర్యం గారి సంస్కారాన్ని కొలతవేసి చూసుకుంటాను.''

అనుపమ కాగితాన్ని మెల్లగా విప్పింది. అనసూయ ఊహాలోకంలో విహరిస్తూ మౌనంగా వింటోంది.

''ముప్పైవేల కట్నం. బాల తొడుగు — ఆడపడుచుల కట్నం—పందిరి మంచం— సన్‌మేక్

డైనింగు టేబిల్ కుర్చీలతో సహా. ఫ్రిజ్ – మోటర్‌సైకిల్ – వాచి–బట్టలు... భయపడకు అనసూ."

"భయమెందుకు పిన్నీ! ఎక్కడో ఒకచోట అనుకోని సంఘటనైతే వింతగా వినవచ్చు. దేశంలో ప్రతి మారుమూల జరిగే సాధారణ సంఘటనలు."

"రేపు వాళ్ళు బయలుదేరేముందు నాన్న గారిని కలుసుకుంటారు.. సూర్యాన్ని మరోమారు చూడాలనుంది కదూ ?"

"ఎందుకుండదు పిన్నీ! పెళ్ళికాని కన్యల మనసెప్పుడూ ఉవ్విళ్ళూరుతుంటుంది. జీవితంలో ఇవే నా మొదటి పెళ్ళిచూపులు – చూసినవారు కాదన్నారో నా మనసు బాధకు గురవుతుంది పిన్నీ!"

"మరి యీ ధరల పట్టీ ?"

"అది నాన్న చూసుకుంటారు ..."

మర్నాడు ఉదయం తిరుగు ప్రయాణమై సూర్యం తండ్రితోను అనుపమతోను అనసూయ ఇంటికి వెళ్ళాడు.

"అలాగే బాబూ! అప్పుడప్పుడు జాబులు రాస్తుండండి, రోజులెలా వున్నాయో తెలుసా? సంబంధం కుదరగానే సరికాదు. మా కట్నం కన్న ఎక్కువిచ్చి పెళ్ళికొడుకుల్ని కొంటున్న రోజులు... సంబంధం స్థిరపడి పోయిందికదా అని మేం ఎదురు చూస్తుంటాము. తీరా జరిగేది మరో అమ్మాయితో వివాహం."

"అలాగే బావగారూ! అనుపమతో అన్ని విషయాలు చెప్పాను. ఏవైనా విషయాలుంటే అనుపమతో చెప్పి రాయించండి... అమ్మా! అనసూయా! వెళ్ళొస్తాం. నీ రెండు చేతుల మధ్య తలక్రిందులుగా వ్రేలాడుతున్న కన్యాశుల్కం పుస్తకం. దానర్థం నన్ను గ్రహించమని చెప్పే సన్నివేశం – ఇలాంటివే పాతరోజుల్లో శాంతారావ్ లాంటివాళ్ళు తమ చిత్రాల్లో చూపించి శభాషని పించుకునేవారు. అవి కదిలే చిత్రాలు... ఇవి నిజజీవితాలమ్మా! వెళ్ళొస్తాం బావగారూ! అనుపమ అన్నీ వివరిస్తుంది మీకు. అన్నీ సమకూర్చుకుని సిద్ధంగా వున్నట్టు జాబురాస్తే, నా భార్యనుకూడ తాంబూళాలు మార్చుకోవడానికి తీసుకువస్తాను."

తనవైపు గంపెడాశతో చూస్తున్న అనసూయ చూపులతో చూపులు కలిపి వియోగ బాధతో తండ్రి వెనుక నడిచి వెళ్ళాడు సూర్యం.

* * *

"అనుపమ అత్తమ్మా! అనసూయ అందాన్ని వీలు చిక్కినప్పుడల్లా మనసులో ఆరాధించుకుంటున్నాను. నా స్నేహితులకామె అందచందాన్ని వర్ణించి చెపుతున్నాను. ఎన్నేళ్ళయినా ఆగి ఆమెనే చేసుకుంటానని శపథం చేస్తున్నాను. నీవు మరోలా భావించకు. ఇందులో జతపరచిన జాబుని అనసూయ కందచేయాలి.



సరదాగా రాసిన జాబు. యువక హృదయం చేసే చిలిపి అల్లరి... సూర్యం.''

అనుపమ అనసూయను కలుసుకుని ''నా చేతిలో ఏముందో చెప్పుకో చూద్దాం అనసూ'' అనడిగింది.

''అంత జ్ఞానశక్తి నాకెక్కడిది పిన్నీ? ఏదో జాబులావుంది. ఆఁ... పెళ్లివారు క్షేమంగా చేరినట్టు రాసివుంటారు. వాళ్లు మరచిపోయిన జాబితాలో ఇంటాడవారు కోరిన కోర్కెల్నికూడ జతపరచి వుండవచ్చును'' అంది జాలిగా చూస్తూ.

''నాకు రాసిన జాబుతోపాటే నీకో జాబు కూడ ఇందులో పెట్టి పంపించాడు సూర్యం... బహుశా ప్రేమలేఖనుకుంటాను.'' అనసూయ అమాయకంగా చూస్తూ ''అలా రాయటం భావ్యమంటావా పిన్నీ?'' అంది.

''మా రోజుల్లో అది దోషం — యీ రోజుల్లో అది ఫేషన్... తప్పులేదులే! సరదాగా రాసివుంటాడు. చదివి చింపేయ్! వీలైతే నీవు కూడ ఓ ప్రేమలేఖ రాసిచూడు. అలా ఐతే హృదయాలు పెనవేసుకుంటాయి. లేదా నిర్లక్ష్యంగా వున్నావని అబ్బాయి మనసు మరో దారికి మరలగలదు.''

''అవును పిన్నీ! నాన్న తెలుగుదేశంలో స్థిరపడాలనుకుంటున్నారు. ఆయన ఆశ నిరాశ చెయ్యకూడదు.''

అనుపమ తిరిగి వెళ్లగానే అనసూయ సూర్యం తన పేర రాసిన జాబు విప్పింది.

''ప్రియమైన అనసూ! అందంతోపాటు వినయ విధేయతలు నీలో చూడగలిగాను. సంస్కారానికి ప్రతిరూపంలా నా కండ్లముందు కన్యాశుల్కం పుస్తకంతో కనుపిస్తున్నావు. చిలిపి కోర్కెలు కోరకుండ నన్నాదుకుని ఆదరించి మా నాన్నకు మహదానందం కలుగచేయమని కోరిన నీ కండ్లలోని జాలి ప్రార్ధనను స్మరణకుతెచ్చుకుంటు న్నాను అనసూ! నాగరికత పెరిగినా మూర్ఖత్వానికీ అజ్ఞానానికీ అది బందీ ఐపోవలసి వచ్చింది... పెళ్లనగానే కొందరు మానసికానందంతో లావై పోతుంటారు. మరికొందరు కన్నవారిల్లు శాశ్వతంగా విడిచిపోవాలి కదా అన్న బెంగతో భోజనం మాని చిక్కిపోతుంటారు. నీ విషయంలో అలా కాకుండ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పెళ్లినాటికి కూడ ఇలానే ఇంత నాజూకుగా వుంటావిని కోరుకుంటున్నాను. అప్పుడప్పుడు అనుపమ అత్తమ్మ నా విషయం ప్రస్తావించినప్పుడు సిగ్గు దొంతరలలో తేలిపోతుంటావు కదూ! మరోలా భావించకుండ నాకు జవాబు రాయాలి. ఎన్నాళ్లైనా వేచివుంటాను. నా తపస్సు ఫలించే రోజుకోసం ఎదురు చూస్తున్న నీ సూర్యం.''

కిటికీలోంచి వాహనాలమూ,జనాన్నిచూస్తూ పిండి పిసికి డ్యూటీ నుంచి తిరిగివచ్చే తండ్రికి రొట్టెలు తయారుచేసింది. ఫేన్‌గాలికి రెపరెప

# ధ్వని-ప్రతిధ్వని

లాడే ముంగురులను, పమిటను సవరించుకుంటూ సూర్యానికి తిరుగుజాబు రాయనా మాననా అని సతమత మౌతున్న సమయంలో విశ్వనాథం వచ్చి ''అనసూ! రాత్రంతా నాన్న వర్క్‌షాపులో పని చేయాలి. రొట్టెలు పాలు అన్నం నన్నక్కడికి తీసుకురమ్మన్నారు. నా నంతు కూడ అందులోనే పెట్టాలి. నేకూడ అక్కడే భోంచేసి చిన్న గదిలో పడుకుంటాను'' అన్నాడు.

''అలాగే బావా! నీకు కూడ ఓవర్‌టైమ్ డ్యూటీయేనా?''

''లేదనసూయమ్మా! పెళ్లిచూపులకు వచ్చి వెళ్లారా! నీవు వాళ్లకు నచ్చావు కదా! నాన్నగారు లేనప్పుడు నే ఇంట్లో వుండకూడదు. అది అధర్మమని నా ఉద్దేశం.''

అనసూయ అన్నీ కట్టి మౌనంగా కేరేజ్‌ని బల్లమీద పెట్టి తీసుకోమంది.

''చూశావా నీలోమార్పు! అది సహజం అనసూ! చేతికివ్వకుండ బల్లమీద పెట్టావు. అది కావాలని చేసింది కాదు. దానంతటదే మలుపులు తిరుగుతుంది.''

తిరిగిపోతున్న విశ్వనాథంలోని సంస్కారాన్ని చూస్తూ అలానే నిల్చుంది అనసూయ. కొద్దిసేపట్లో భోజనం కానిచ్చి మంచంపై ఇటునటు దొర్లుతూ సూర్యం రాసిన జాబును మరోమారు విప్పింది. తిరుగుజాబు రాయటం వలన ఏమంత ప్రమాదం లేదనీ — అనురాగం ఆప్యాయతా పెనవేసుకుంటాయనీ ఆ బంధాన్ని ఎవరూ త్రుంచలేరనీ అనుపమ చెప్పిన మాటల్ని గుర్తు చేసుకుని మెల్లగా లేచింది. తల్లి ఫోటో వైపు చూసింది.

''జీవితములో ఎప్పుడూ తప్పు చేసినట్టు గుర్తు లేదమ్మా! నన్ను చూసి వెళ్లారు. ప్రాధేయపడుతూ సూర్యం నన్ను తిరుగుజాబు రాయమన్నారు. అందుకే రాస్తున్నానమ్మా.''

''గౌరవనీయులైన సూర్యంగారికి నమస్కారములు... ప్రియమైన అన్న మాట వాడలేదని

## అధిక సంతానం

నెల తప్పిన
దుబారా ఖర్చుకి
తొమ్మిది నెలలు నిండవు
పురిటి నొప్పి ఉండవు
కాని సుఖంగా కంటుంది
అప్పుల్ని తాకట్టుల్ని
ప్రాంసరీ నోట్లని తనఖాల్ని
వగైరా వగైరా స్వాహా సంతుని

—మాధవరపు కృష్ణ.

మరోలా భావించకండి. అది ధైర్యంపై ఆధారపడి వుంటుంది. మీరు సాధారణమైన జాబు మాత్రమే రాశారు. అది ప్రేమలేఖని భ్రమపడి నేనుకూడ శృంగారంగా జాబు రాశాననుకోండి. వెంటనే శీలానికి వెలకడతారు... కన్యను. నా పరిధిలో నేనుండాలి. అమ్మానాన్నలకు నా నమస్కారములు తెలియచేయండి. ఐదుగురాడపడుచులకు నా ఆశీర్వచనాలు — మీ మంచిని అనుపమ సవిస్తరంగా చెప్పింది. పెళ్లి ఎలాగూ జరగక మానదు. దానికి కావలసిన సామాన్లు సమకూర్చుకోవడంలో నిమఘ్నులమై వున్నాం. ఇంత తక్కువ వ్యవధిలో ఇన్ని సామాన్లు కొనడానికి డబ్బెక్కడిదని అడుగుతారేమో! విశ్వనాథం బావ తన జీతం తొమ్మిది వందల్లో నెలకు ఆరు వందలు బేంకులో జమ చేస్తున్నాడు. అదంతా నాకోసమని ఆ పిచ్చివాడికి తెలీదనుకుంటాను. మా ఇంట్లో తింటూ మాకీ విధంగా ధనసహాయం చేసి మీ కోర్కెలు తీర్చడానికి కారణభూతుడైన విశ్వనాధానికి మనిద్దరం కృతజ్ఞతలు తెలియచేసుకోవాలి... జాబులు రాయకూడదని కాదుగాని పెళ్లి కాకుండ ఇలా జాబులు రాసుకోవడం... భయంగా వుందండీ! అప్పుడప్పుడు కొంటున్న వస్తువుల జాబితా తెలియచేస్తుంటాను. మరేవైనా ఖరీదైన వస్తువులు అనుపమ కిచ్చిన జాబితాలో లేకపోతే రాయండి. నాన్నచేత కొనిపిస్తాను...

అనసూయ''


జాబును చదువుకున్న సూర్యం ఉక్కిరిబిక్కిరైపోయాడు. శృంగారం ఒలకపోయకుండ పెద్దల తరహాగా రాసిన జాబు. ''మేమనుకున్న కట్నంతోపాటు విలువైన సామాన్లు—అనసూయ నాది. ఏ విజయనగరమో అయితే ఎంత బాగుండేది! ఏదో మిషమీద వెళ్లి చూసివచ్చేవాడిని. మనసులోని తాపం తీరేది. జంషెడ్‌పూర్‌లో ఎందుకున్నావు అనసూ?'' అని గదిలో సూర్యం చిందులు త్రొక్కుతున్నాడు. అప్పుడే లోన అడుగుపెట్టిన పెద్ద చెల్లాయి ''ఏమయిందన్నయ్యా? భరతనాట్యం చేస్తున్నావు. అనసూయ వదిన గుర్తుకొచ్చిందా?'' అంటూ సూర్యం చేతిలోని జాబును చదివింది.

''అబ్బ! ప్రేమలేఖల్లో పడ్డారన్నమాట!... అన్నీ బాగున్నాయి కాని ఐదుగురాడబిడ్డలకు ఐదు విలువైన పట్టుచీరలు విషయం అడిగారు కాదేం? మీకు కావలసినవీ రావలసినవీ ఒక్కటీ విడవకుండ అడుక్కున్నారు. మా విషయం విడిచిపెట్టారు. అందుకే నేకూడ మీతో వస్తానన్నాను.''

''యీమారు జాబులో రాస్తానులేవే! వేలకువేలు ఖర్చు పెడుతున్నారు. మీ విషయంలో అన్యాయం చెయ్యరులే'' అని బుజ్జగించాడు.

* * *

''అనసూ! జాబు రాయవేమో అనుకుంటున్న సమయంలో మనసు పూరట




కలిగించే జాబు రాశావు. ఆడపడుచుల ఖరీదైన పట్టుచీరల ప్రస్తావన తెచ్చింది మా పెద్ద చెల్లెలు. ఇప్పటినుంచే కొని పెట్టుకుంటే పెళ్లినాటికి పాతబడిపోతాయి. అలాంటివాటిని పెళ్లికి ముందు కొనవచ్చునుకుంటాను. అమ్మ మొన్న భోజనం చేస్తున్నప్పుడు అన్న మాటలివి. రాను పోను రైలు చార్జీలు మిమ్మల్నే భరించమంటున్నారు. ఆఫీసు వాళ్ళ బంధువులు సంఖ్యలో చాలమందుంటారు. తట్టుకోవడం కష్టమేమో అని నేనన్నాను... విశ్వనాధం ఆర్జన ఆ ముసలాయన సంపాదన అనసూయ గురించికాక మరెవరి గురించిరా అని అమ్మ అంది. అదీ నిజమేనని ఆ విషయంకూడ ఇందులో రాస్తున్నాను...''

* * *

''డియర్ అనసూ! జాబుల ద్వారా తొమ్మిది మాసాల తపస్సు పూర్తయింది. మీ నాన్నగారు రిటైరై ఇంటివద్ద వున్నారని రాశావు. ఆయనకు రావలసిన డబ్బు రాగానే నాకు తెలియచేయండి. అన్నీ సమకూడగానే అందరమూ వచ్చి నిశ్చితార్థం పుచ్చుకుంటాం''....

''సూర్యంగారికి అనసూయ సమస్కారములు. తానొకటి తలస్తే దైవమొకటి తలచాడంటారు–ఇదే కాబోలు...నాన్నగారికి డబ్బొస్తుందని వేయికళ్లతో ఎదురు చూస్తున్నాం. ఆయన ఇన్‌చార్జిగా వున్న సెక్షన్‌లో చాల సామాన్లు కనుపించడం లేదట! వాటి విలువకట్టి అదంతా నాన్నగారి మీదే రుద్దుదామని చూస్తున్నారు. యూనియన్ నాయకులు కూడ కలిగించుకున్నారు గాని లాభంలేనట్టే వుంది. శుభమా అని కూతురు పెళ్లి చేసుకోబోతున్న వాడు ఎన్ని బాధలకు గురయాడని అందరూ చింతిస్తున్నారు. ఒక్కొక్క కార్మికుడు తనకు తోచింది నాన్నకు విరాళంగా ఇవ్వదలదుకున్నాడు. చాల డబ్బు పోగయే అవకాశముంది. కష్టార్జితం కట్నంగా ఇవ్వకుండ అందరూ కలసిచ్చిన డబ్బు కట్నంగా ఇవ్వవలసి వస్తోందని బాధగా వుంది. ఏం చేస్తాం? నాన్నకు లేకలేక కలిగిన సంతానాన్ని. తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలిని. నలుగురిచ్చిన చందాలతో పెళ్ళి చేసుకోవలసి వస్తోందని బాధగా వుంది. యీ జాబుకు తిరుగు జాబు త్వరగా రాయరని నాకు తెలుసు–కారణం కట్నం సొమ్ములేక పోవడం...అనసూయ''

జాబందుకున్న సూర్యం ముఖాన చెక్కితే నెత్తురులేదు. అన్నీ సమకూర్చుకుంటే వెంటనే పెళ్లి కార్యక్రమాలు మొదలు పెడదామనుకుంటున్న సమయంలో అనుకోని సంఘటన జరిగిందని బాధపడుతున్నాడు...

''సూర్యంగారూ! ప్రేమపాశం వేశారు. అది శాఖోపశాఖలై విస్తరించి సంవత్సరమయింది. డబ్బు పోయిందనేసరికి వీగిపోయినట్టు నెల రోజులైనా జాబు రాశారుకాదు. నిజమైన ప్రేమకు చిహ్నమంటారా మీరు? కానేకాదు సూర్యంగారూ! అసలుసిసలైన ప్రేమంటే ఏంటనుకున్నారు? తలితండ్రుల్ని ఎదిరించే మనోనిబ్బర ముండాలంటాను. ఎన్నో ప్రేమ కథలు చదివి ఎన్నో ప్రణయ సినీమాలు చూసి బాగున్నాయని మెచ్చుకోవటంకాదు. వాటిని ఆచరణలో పెట్టగలగాలి సూర్యంగారూ! కార్మికులందరూ విరాళంగా ఇచ్చిన డబ్బు నాన్నకు రావలసిన డబ్బుకన్న హెచ్చుగానే వచ్చింది...మీరు ఎకౌంట్స్ పరీక్షకు చదువుతున్నట్టు రాశారు. శుణ్ణంగా చదివి పరీక్ష రాసిం తర్వాతగాని నాన్న పెళ్లి మాటలు మాట్లాడవద్దన్నారు. కారణం? పెళ్లయిందో సంసారంలోపడి పరీక్షలు వాయిదా వేయటం జీవితాంతం గుమస్తాగిరీలోనే వుండి పోతారని నాన్నభయం...మరో సంవత్సరం ఓపిక పట్టగలరేమో చూడండి సూర్యంగారూ''

''డియర్ అనసూ! డబ్బు ప్రోగయిందని తెలిసి చాల సంతోషించాను. పెళ్లి తప్పిపోతుందని భయపడుతున్న సమయంలో చల్లని శుభవార్త తెలియ చేశావు. నీకెలా కృతజ్ఞతలు తెలియ చేసుకోవాలో తెలియటం లేదు ... మంచికీ చెడ్డకూ వెళ్లిరావటం కష్టం అంత దూరమెందుకురా బాబూ వాళ్లిచ్చే కట్నం కన్న మరో పదివేలెక్కువ ఇస్తామని మరొకాయన వచ్చి నాన్న చెవిలో ఒకటే రొదపెడుతున్నాడు. యీ సంబంధం నాకిష్టమయిందనీ వేరే సంబంధం సుతరామూ ఇష్టం లేదనీ నొక్కిచెప్పాను. మీ నాన్న తెలుగుదేశంలోనే స్థిర నివాసమేర్పరచుకుంటారనీ దూరతీరాలకు వెళ్లివచ్చే ప్రసక్తే లేదన్నాను. అక్కడ మీ నాన్న పేరనున్న స్థలం అమ్మి విశాఖలోనే స్థలం కొంటారని కూడ చెప్పాను. ఎక్కడ కొన్నా ఎంత ఖర్చయినా అంతా నీకే కదు అనసూ! ఇక్కడ ఊడాలో స్థలం చాల మంది కొంటున్నారు. ఇప్పుడు మీ దగ్గరున్న డబ్బు మాకు పంపితే నీపేర స్థలం కొంటాము. నాన్న స్థలమమ్మిన డబ్బు మున్ముందు ఎక్కువ ధర కూడ కిట్టవచ్చు కట్నం కింద వాడుకోవచ్చును. ఇది మా కుటుంబాని కంతటికీ కలిగిన మంచి కోర్కె– కాదన కూడదు– పెళ్లి తర్వాత కొనాలన్నా అంగుళం స్థలం విశాఖలో దొరికే అవకాశం లేదు. ఆలోచించి జాబు రాయాలి – సూర్యం ...''

''సూర్యం గారూ! మన భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని స్థలం గురించి రాసిన జాబు చేరింది. తిరుగు సమాధానం మూడు నెలలకు గాని రాయలేక పోయాను. కారణం విశ్వనాధం బావ నాన్నను ఒకే ఒక కోర్కె కోరారు. ఎలాగూ తెలుగుదేశం పోయి స్థిరపడి పోతున్నారు. అనసూయ విలువైన సామాన్లన్నీ కొన్నది నా డబ్బుతోనేగా! వాటి బదులు నాకా స్థలమైనా మిగిల్చి పొండని ప్రాధేయపడ్డాడు. నాన్నగారు కాదనలేకపోతున్నారు. కార్మికులిచ్చిన డబ్బు కట్నం కింద వాడకుండ మరోలా వాడితే కట్నానికి డబ్బుండక పెళ్లి మరీ కాలయాపనౌతుందని భయంగా వుందండీ... అనసూయ...''

రోజులు గడుస్తున్నాయి. అనసూయ సూర్యం అప్పుడప్పుడు జాబులు రాసుకుంటున్నారు.

''అనసూ! మీ దయవలన ఎకౌంట్సు పరీక్ష పాసయాను. నీకు కాబోయే భర్త సాధారణ గుమస్తా కాదు. ఎకౌంటెంటు. ఎందరో వచ్చి చేతులు కట్టుకు నిల్చుంటారు తమ తమ బిల్లుల

## ధర్మపథం - బులుసు వేంకట రమణయ్య

# భూషణ ధారణ



భర్తృహరి మహాకవి తన సుభాషితాలలో ''వాగ్భూషణం భూషణం'' అని, ప్రశస్తమైన వాక్కే భూషణమనీ, శరీరాన్ని అలంకరించుకునే నగలూ, మున్నగునవి తుగినవి కావనీ చెప్పాడు. నగలకంటే మంచి వాక్కే ఉత్తమమైనదే! నిజమే! కాని నగలక్కూడా విలువ లేకపోలేదు. ఆర్థిక పరిస్థితులను బట్టీ, దేశ కాలాలను బట్టి పూర్వకాలపు నగలు తగ్గిపోయి, వాటి స్థానంలో నకిలీ నగలు వచ్చాయి. పూర్వం స్త్రీలతో పాటు పురుషులు కూడా నగలు ధరించేవారు. చెవులకూ, దండలకూ, చేతులకూ, వేళ్ళకూ, నగలు పెట్టుకోవడం, కంఠహారాలు ధరించడం, పూవులు ముడుచుకోవడం పురుషులలో కూడా ఉండేది. దేవతా విగ్రహాలలో పురుష విగ్రహాలకు కూడా విలువైన నగలు పెట్టేవారు. అది ఇప్పటికీ కానవస్తూ ఉన్నది. పురుషులు స్త్రీల మాదిరిగా నగలు ధరించడం ఇప్పటి వారికి పరిహాసాస్పదంగా ఉంటుంది.

కాని, శరీరానికి భూషణాలు కొంత శోభను కలిగించడం వల్ల అలంకార ధారణ అవసరమైనది. ఆకార రహితుడూ, గుణాతీతుడూ అయిన భగవంతునికి స్వరూపకల్పన చేసినప్పుడు విగ్రహాలకు నగలు పెట్టడంలో వింతలేదు.

చక్కదనాన్ని పెంపొందించడం మాత్రమే ఆభరణాల ప్రయోజనం కాదు. రత్నాభరణాల వల్ల, సువర్ణాభరణాల వల్ల శరీరానికి ఆరోగ్యం కలుగుతుంది. సువర్ణ స్పర్శగల నీరు ఆరోగ్యానికి కారణమవుతుంది. ఇది శాస్త్రవేత్తల నిర్ణయం. బంగారపు గొలుసు మెడలో వేసుకొంటే కొన్ని రోగాలు ఉపశమించడం కానవస్తూనే ఉన్నది. ఈ ప్రాశస్త్యాన్ని గ్రహించే ఆధునికులు — పురుషులు కూడా అధమం బంగారపు ఉంగరాన్నయినా ధరిస్తూ ఉంటారు.

బంగారు ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ కాలంలో బంగారు నగల్లా కానవచ్చే నకిలీ నగలను పిల్లలకు—చెవులకూ వాటికీ పెట్టడం జరుగుతున్నది. వాటివల్ల చెవులకు పుండ్లు పడడం మొదలైన రోగాలు సంభవిస్తున్నవి. ఇటువంటి వాటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండవలసి ఉన్నది.

నగల వలన శోభతోపాటు ఆరోగ్యం కలుగుతూ ఉన్నందువలననే మన పూర్వులలో పురుషులు కూడా వివిధాభరణాలు ధరించే వారని, వారిని అవహేళన చేయనక్కర్లేదనీ తెలుసుకోవాలి. ★

## ధ్వని - ప్రతిధ్వని

కోసం... మీరు నిర్ణయించిన కట్నం గుమస్తాగా వున్నప్పటిదనీ ఎకౌంట్సుకి వేరే రేటనీ మా ముసలాయన గొణుక్కుంటున్నాడు. మొన్న మొన్ననే ఇలాంటి విషయంలోనే మా ఆఫీసులో ఓ పెళ్లి తప్పిపోయింది. అయినా మొదటి మాటకే కట్టుబడి వుండాలన్న దృఢ నిశ్చయానికి వచ్చాను... సూర్యం.''

''సూర్యంగారూ! మీరు రాసిన కొన్ని జాబులు మా నాన్న కంటబడ్డాయి. పాతకాలం మనిషి — కాస్తంత ముఖం చిట్లించారు. నేనిప్పుడాయన ముఖం సూటిగా చూడలేక పోతున్నాను. ఆ రోజుల్లో జాబులు ఆయనింటి దగ్గర లేనప్పుడు అనుపమ పిన్ని తెచ్చిస్తుండేది. ఇంటి దగ్గరున్నారేమో మీ జాబులందుకోడానికి చాల ఇబ్బందిగావుంది. అన్నీ సమకూర్చుకున్నాం. దగ్గర దగ్గర రెండేళ్ళు తపస్సు చేశాం—ఎలాగూ వస్తారుగా! మూఢందాటేక మంచిరోజు చూసి బయలుదేరండి — ఇదే నా ఆఖరి జాబు... అనసూయ.''

* * *

''అనుపమ పిన్నీ! వాళ్లొచ్చేస్తుంటారు... యీ జాబులన్నీ సూర్యం రాసినవి. ఇన్నాళ్లు యీ ప్రేమలేఖల్ని చదువుకుంటూ భావిజీవితాన్ని మధురాతి మధురంగా మనసులో చిత్రించుకునే వాళ్లం. యీనాటి నుంచీ జాబులు చదువుకుని ఆనందించే అవకాశం వుండనే వుండదు.''

అనసూయ చేతిని అనుపమ కొంటెగా నొక్కింది ...

సూర్యం తల్లితండ్రులతో సరాసరి అనుపమ ఇంటికి వచ్చాడు.

అనుపమ చేతిలోని బాబును సూర్యం తండ్రి ఎత్తుకున్నాడు.

''మీ చెల్లాయ్ కొడుకనుకుంటాను. నీకు మంచి కాలక్షేపం. కుటుంబ నియంత్రణ పాటించమను. నాలా అరడజను పిల్లల్ని కని తర్వాత కళ్లు విప్పేకన్న ముందుగానే మేల్కోవటం మంచిది అనుపమా'' అన్నాడు సూర్యం తండ్రి.

''మా చెల్లాయ్ కొడుకు కాదన్నయ్యా! అనసూయ కొడుకు.''

''ఛా! వేళాకోళం పోనిచ్చుకున్నావుకాదు... పెళ్లిచూపులు తప్పించాలని చూస్తున్నావు కదూ!''

''నాకేం కలిసొస్తుందన్నయ్యా! నేను యవ్వనంలో వున్నప్పుడు ఎందరో వచ్చి చూసి వెళ్లి మోయలేని కట్న కానుకలకు బలిచేసి నన్నొంటరిగానే వొదిలి నా తలలో తెల్ల వెంట్రుకలు తీపి గుర్తులుగా మిగిల్చి నా పేరు జీవితాంతం కుమారి అనుపమగానే రాసుకొమ్మని మగజాతి నన్ను శాసించింది. శపించింది. అబద్ధం చెప్పి పెళ్లి తప్పిస్తే నాకేం కలిసొస్తుందన్నయ్యా! నిజంగా అనసూయను వాళ్లబావ విశ్వనాథానికిచ్చి ఆ ముసలాయన రిటైరైన రోజునే కార్మికుల సమక్షంలో ఏ ఆర్భాటమూ లేకుండ పెళ్లి జరిపించారు. అనసూయకూడ తండ్రి వారసత్వపు ఉద్యోగం టైపిస్టుగా ఆ ఆఫీసులో చేరింది. చిన్న కుటుంబం. కావలసినంత డబ్బు.''

అందరూ నిర్జీవ ప్రతిమల్లా అనుపమ మాటల్ని వింటున్నారు.

ఇంతలో అనసూయ పాలసీసాతో అక్కడికి వచ్చి బాబుని చేతిలోనికి తీసుకుంది.

''మా బాబుని చూశారా సూర్యంగారూ! గురజాడ సంస్కృతిని జీర్ణం చేసుకున్న మా బావ గొప్పా? విజయనగరంలో పుట్టి గురజాడను ఆవగింజంతైనా అవగాహన చేసుకోలేని మీరు గొప్పా? చెప్పండి సూర్యంగారూ! నా చేదు మాత్రలు మీరు మింగలేరనుకుంటాను. దూరపు కొండలేకాదు దగ్గరి కొండలుకూడ నున్నగా వుంటాయని మా బావ నిరూపించాడు. నన్ను క్షమించాలి సూర్యంగారూ! మీరు చేసిన ధ్వనికి నా ప్రతిధ్వని... అంటే'' అంటుండగా దిగజార్చిన ముఖాలతో వెనుతిరిగారు పెళ్లివారు.

వాళ్లను కన్నీళ్లలో గేటువరకూ సాగనంపింది అనసూయ బాబును గుండెలకద్దుకుని సూర్యం సరసను నడుస్తూ. ★